www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 11 ఏప్రిల్ 2025

5

అన్నమయ్య



తాగునీటి సమస్య రాకుండా చూసుకోండి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ మనోహరరాజు అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపిపి అరుణమ్మ గైర్హాజరు కావడంతో ఎంపిటిసి రాజేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలని సూచించారు. అంతే కాకుండా ఎండలు ఎక్కువగా ఉండడంతో వైద్య శిబిరాలను ఏర్పాట్లు చేసి ఎండదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించడం, వడదెబ్బకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం చేయాలని సూచించారు. మండలంలో రోడ్లు, కాలువలు, తదితర అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.








రారండోయ్.. వేడుక చూద్దాం

నేడు సీతారాముల కల్యాణం

రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం

పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఒంటిమిట్ట విద్యుత్ దీపాలతో, ఆకాశమంత పందిళ్లతో కళకళలాడుతోంది. ఇప్పటికే రాష్ట్ర నలుమూలల నుంచి స్వామివారి కళ్యాణాన్ని తిలకించేందుకు యాత్రికులు ఒంటిమిట్ట చేరుకున్నారు. కళ్యాణశోభను ఒంటిమిట్ట సంతరించుకుంది. రామనామ స్మరణతో ఏకశిలానగరం మారుమ్రోగుతోంది. విఐపిల రాక, పోలీసుల బందోబస్తుతో ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు నూతన శోభను సంతరించుకుంది. కళ్యాణోత్సవానికి ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రానుండటంతో పోలీసులు అడుగడుగునా మోహరించి కట్టుదిట్టమైన భద్రతాచర్యలు చేపట్టారు.



ప్రజాశక్తి - కడప ప్రతినిధి/ఒంటిమిట్ట

ఏకశిలానగరిలో శుక్రవారం రాత్రి నిర్వహించనున్న సీతారాముల కల్యాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసింది. శ్రీకోదండరాముని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఒంటిమిట్ట కోదండ రామాలయం విద్యుత్ దీపపు ధగధగలతో దేదిప్యమానంగా ముస్తాబైంది. నభూతో నభవిష్యతి అనేరీతిలో విద్యుత్ కాంతుల మధ్య ఆకాశమంత చలువపందిళ్లతో కళకళ లాడుతోంది. రాష్ట్రం నలుమూలల నుంచి జగదబిరాముని కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు, యాత్రికులు, సేవకులు ఒంటిమిట్టకు చేరుకున్నారు. జగదభిరాముని ఆలయంలోని దత్తమండపం, ధ్వజస్తంభం, కల్యాణవేదిక విద్యుత్ కాంతులతో కల్యాణశోభను సంతరించుకుంది. ప్రభుత్వం తరుపున కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో రానుండడంతో నూతనశోభ చోటు చేసుకుంది. పలువురు మంత్రులు, విఐపిలు రానున్నారు. సుమారు రెండు వేల మంది పోలీసులు అడుగడుగునా మోహరించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజునాటికి కల్యాణ ఘడియలు సమీపించడంతో పలువురు భక్తులు, పర్యాటకులు, యాత్రికులు, సేవకులు కల్యా ణోత్సవాన్ని తిలకించేందుకు ఎదురు చూస్తున్నారు. ఒంటిమిట్ట గ్రామ శివారులోని కల్యాణ వేదిక, దత్తమండపం, కోదండ రామాలయం విద్యుత్ కాంతులతో శోభాయమానంగా ప్రకాశిస్తోంది. ఎలాంటి అవాంఛనీయమైన ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అడుగడుగునా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. గతానికి భిన్నంగా భారీఎత్తున ప్రత్యేక బారీకేడ్లను ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవాన్ని జయప్రదం చేయడానికి పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లను చేయడం గమనార్హం. శుక్రవారం రాత్రి చంద్రుని వెన్నెల్లో జరిగే కల్యాణోత్సవానికి పలువురు దాతలు అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. సీతారాముల కల్యాణం అనంతరం టిటిడి యంత్రాంగం లక్షలాది మందికి భోజన సదుపాయాలను ఏర్పాటు చేసింది.

కల్యాణానికి కోటి తలంబ్రాలు సమర్పణ

ఒంటిమిట్టలో శుక్రవారం జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణానికి తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కళ్యాణ అప్పా రావు ఆధ్వర్యంలో గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను గురువారం సమర్పించారు. 120 కిలోల బరువైన ఈ తలంబ్రాలను ఆలయం వద్ద సూపరింటెండెంట్ హనుమంతయ్య, అర్చకులు శ్రావణ్ కుమార్ సమక్షంలో అందించారు. ఈ తలంబ్రాల కోసం మూడు నెలల పాటు వరిని ప్రత్యేకంగా పండించి ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఢిల్లీ రాష్ట్రాలకు చెందిన భక్తులు ఎంతో భక్తి భావంతో మూడు నెలల పాటు గోటితో ఒలిచి సిద్ధం చేశారు. ఈ సంఘం ఆధ్వర్యంలో 14 ఏళ్లుగా భద్రాద్రి రామునికి, మూడు ఏళ్లుగా అయోధ్యకి, 8 ఏళ్లుగా ఒంటిమిట్ట రామునికి కల్యాణోత్సవం సందర్భంగా అందజేస్తున్నామని కళ్యాణ అప్పారావు తెలిపారు.



కోటి తలంబ్రాలకు పూజ నిర్వహిస్తున్న అర్చకులు

కల్యాణోత్సవానికి ఏర్పాట్లు సిద్ధం : చైర్మన్

ఒంటిమిట్టలో శుక్రవారం సాయంత్రం 6:30 నుండి రాత్రి 8:30 గంటల మధ్య శ్రీ సీతారామ కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు చెప్పారు. చైర్మన్ టిటిడి, జిల్లా అధికారులతో కలిసి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం ఒంటిమిట్ట ఆలయ ప్రాంగణంలోని పరిపాన భవనం మీటింగ్ హాల్‌లో చైర్మన్, ఇఒ జె.శ్యామలరావు, కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జెఇఒ వీరబ్రహ్మం, జెసి అదితి సింగ్, ఎస్‌పి ఇ.జి.అశోక్ కుమార్, సివిఎస్ఒ హర్షవర్ధన్ రాజుతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఏకశిలానగరంలో శుక్రవారం జరుగనున్న శ్రీ సీతారాముల కల్యాణాన్ని టిటిడి, జిల్లా యంత్రాంగం సమన్వయంతో వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. సీతారాముల కల్యాణం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమం నారా చంద్రబాబు నాయుడు పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. కల్యాణ వేదిక ప్రాంగణం వద్ద ఉన్న 147 గ్యాలరీలలో 60 వేల మంది సౌకర్యవంతంగా కూర్చుని వీక్షించేందుకు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి గ్యాలరీలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారామెడికల్, టిటిడి ఉద్యోగులు, పోలీసు, శ్రీవారి సేవకులు ఉండేలా చర్యలు చేపట్టామని చెప్పారు. కల్యాణ వేదిక ప్రవేశ ప్రారంభంలో తలంబ్రాలు పంపిణీ కోసం తొలిసారిగా ప్రత్యేకంగా 28 కౌంటర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కల్యాణోత్సవానికి విచ్చేసే ప్రతి భక్తుడికి ముత్యాల తలంబ్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, కంకణం, అన్నప్రసాదాలు అందించేలా పటిష్ట ఏర్పాట్లు చేపట్టామన్నారు.

గరుడ వాహనంపై సీతాపతి



ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం రాత్రి స్వామివారు గరుడ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. రాత్రి 7 గంటలకు ప్రారంభమైన వాహన సేవ 9 గంటల వరకు జరగనుంది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శిం చుకు న్నారు. ఉదయం మోహినీ అలం కారంలో రాములవారు జగన్మోహ నాకా రుడిగా దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటలకు స్వామివారి ఊరేగింపు వైభవంగా ప్రారంభమైంది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలా టాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శిం చుకున్నారు. వాహన సేవలో ఆలయ డెప్యూటీ ఇఒ నటేష్ బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించకపోతే ఉరే శరణ్యం

- వినూత్నంగా ముదివేడు రైతుల నిరసన



ఉరి వేసుకుని వినూత్నంగా నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ముదివేడు రిజర్వాయర్ కోసం తీసుకున్న భూములకు నష్టపరిహారం చెల్లించకపోతే ఉరే శరణ్యమని ముదివేడు రిజర్వాయర్ నిర్వాసిత రైతులు వాపోయారు. గురువారం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఉరితాళ్లు మెడకు బిగించుకుని కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. ముదివేడు రిజర్వాయర్ కోసం భూములు లాక్కొంటే, ప్రస్తుత ప్రభుత్వం పరిహారం చెల్లించకుండా, పునరావాసం కల్పించకుండా రైతులను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా పట్టించుకోక పోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. రైతుల భూములకు నష్టపరిహారం చెల్లించలేని పక్షంలో భూములు వెనక్కి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించక పోతే ఉద్యమం ఉధృతం చేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాసులు, రాజేష్, వెంకటరెడ్డి, మారపరెడ్డి, తిమ్మారెడ్డి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం : మంత్రి

ప్రజాశక్తి-చిన్నమండెం

ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్య తనిస్తోందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి పోయాయి కానీ ప్రజల గురించి పట్టించుకునే నాధుడే లేరన్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు నిరంతరం ప్రజాసేవకే తన సమయాన్ని కేటాయించి ప్రజల సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలు పొందాలంటే ప్రజలు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే వారిని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కులమత, ప్రాంత బేధాలు లేకుండా పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలు ప్రజల ముంగిటికే తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో అనర్హులకు పెన్షన్లు మంజూరు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ప్రభుత్వం ఏర్పడిన 9, నెలల కాలంలోనే నిజమైన లబ్ధిదారులను గుర్తించి ప్రతి ఒక్కరికి పెన్షన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల అర్జీలు స్వీకరించి అక్కడికక్కడే వారి సమస్యలు పరిష్కరించడం జరిగింది.

ప్రతి గ్రామానికి మౌలిక వసతుల కల్పనకు కృషి

రామాపురం : ప్రతి మారుమూల గ్రామానికి సైతం మౌలిక వసతులు కల్పిస్తామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. తాగునీరు, వీధిదీపాలు, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయడమే తమ ధ్యేయమన్నారు. మండలంలోని శుద్ధమల్ల గ్రామం పాత పంచాయతీ కార్యాలయం నుంచి ఎగువ దళితవాడకు రూ.16.80లక్షలతో వేసిన సిమెంట్ రోడ్డును మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో మండలంలోని సమస్యలను పరిష్కరించడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందన్నారు. రామపురం మండలాన్ని ద్వారకానాథ్‌రెడ్డి సహకారంతో మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. మండలలలోని ప్రజలు తమ సమస్యలపై మంత్రికి అర్జీలు సమర్పించారు. సమస్యలపై అధికారులు చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గడికోట కిరణ్‌కుమార్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్దిరేవుల రమేష్‌రెడ్డి ఆగ్రో వెంకట్రామిరెడ్డి, ఆంజనేయులురెడ్డి, రాయచోటి అర్చన కళాశాల అధినేత మదన్ మోహన్‌రెడ్డి, సరస్వతి పల్లి గ్రామం సర్పంచ్ మునీర్‌బాషా, గాలివీటి సురేందర్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి, రామకృష్ణ గౌడ్, రేఖం సోదరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రైతులకు అవగాహన కల్పించాలి : కలెక్టర్



రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్


ప్రజాశక్తి - బి.కొత్తకోట

పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని, ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. గురువారం మండలానికి చెందిన గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన సహాయకులతో వ్యవసాయం, ఉద్యానవన పంటలపై సమావేశం నిర్వహించారు. మండలంలో ఎంత విస్తీర్ణంలో ఏయే వ్యవసాయ ఉద్యాన పంటలు సాగవుతున్నాయి, పంటకాలం, పంటల దిగుబడి, చీడపీడల నివారణ, యాజమాన్య పద్ధతులపై రైతులకు అందిస్తున్న సేవలు, అవగాహన కార్యక్రమాలు తదితరాలపై సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై తగుసూచనలు కలెక్టర్ జారీ చేశారు. వేసవిలో నీటి ఎద్దడి వల్ల వ్యవసాయ ఉద్యాన పంటలు ఎండిపోకుండా తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తుల పరిష్కారం, రెవెన్యూ రీ సర్వే సదస్సులలో అందిన దరఖాస్తుల పరిష్కారం తదితరాలపై కూడా రెవెన్యూ అధికారులతో సమీక్షించారు.ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు నాణ్యతగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం అనంతరం క్షేత్రస్థాయిలో కలెక్టర్ పర్యటించారు. మండలంలోని బూచుపల్లి గ్రామంలో సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ పథకంలో భాగంగా రైతు ఎస్.నగేష్ బాబు పాలీహౌస్‌లో చేపట్టిన గులాబీ పూల సాగును కలెక్టర్ శ్రీధర్ చామకూరి పరిశీలించారు.ఈ సందర్భంగా పూలసాగు,నిర్వహణ ఖర్చులు,ఆదాయాలపై రైతును కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. 4 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.40 లక్షల అంచనాతో సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ పథకంలో భాగంగా రోజాపూల సాగును చేపట్టినట్లు రైతు కలెక్టరుకు వివరించారు. పథకంలో భాగంగా 50 శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు. బీరంగి గ్రామంలో మల్చింగ్ పద్ధతిలో సాగు చేస్తున్న టమోటా మిరప పంటలను కూడా కలెక్టర్ పరిశీలించి అధికారులు రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకొని ఉద్యాన, పూల సాగు రైతులందరూ అభివృద్ధి చెందాలని కలెక్టర్ రైతులకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మహమ్మద్ అజారుద్దీన్, ఎంపిడిఒ దిలీప్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారులు, వివిధ శాఖల మండల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు హెచ్చరించారు. మార్చి 31న రంజాన్ పండుగ రోజున రాయచోటి పట్టణంలోని శివాలయం సర్కిల్‌లో రెండు గ్రూపులకు చెందిన వారు మారణాయుధాలతో పరస్పర దాడులకు పాల్పడ్డ ఘటనలో 9 మంది నిందితులను అరెస్టు చేశారని చెప్పారు. వారి వద్ద నుండి ఇనుప రాడ్లు, ఇనుప చైన్లు, కర్రలు, 9 సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.రెండేళ్ల కిందట ఓ అమ్మాయి విషయంలో రెండు గ్రూపుల మధ్య వివాదం తలెత్తిందని, దీంతో వారు పరస్పర దాడులకు పాల్పడేవారన్నారు. ఈ క్రమంలో రంజాన్ పండుగ రోజున రాయచోటి శివాలయం సర్కిల్‌లో ఓ గ్రూపునకు చెందిన దేశముక్ అస్రాన్ అలీ ఖాన్, రియాన్ అలీ ఖాన్, అహ్మద్ బాషాలపై మరో గ్రూపునకు చెందిన వారు మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఇరు గ్రూపులకు చెందిన 24 మంది ఒకరిపై ఒకరు పరస్పర దాడులకు పాల్పడ్డారు అన్నారు. దేశముక్ అస్రాన్ అలీ ఖాన్, రియాన్ అలీ ఖాన్, అహ్మద్ బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు. ఈ కేసులో 24 మంది నిందితులలో 9 మంది నిందితులను అరెస్టు చేయగా, మరో 15 మంది నిందితులు పరారీలో ఉన్నారని చెప్పారు. పరారైన నిందితుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నామని, వారిని కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని తెలిపారు. రాయచోటి పట్టణంలో ఇప్పటికే 4 గ్యాంగులకు చెందిన 100 మందిని గుర్తించామని మీరందరిపై త్వరలో రౌడీషీట్ ఓపెన్ చేస్తామని అన్నారు. వీరిలో ఎవరిపైన అయినా 10 కేసులకు మించి ఉన్నట్లయితే అలాంటి నిందితులను పీడీ యాక్ట్ నమోదు చేసి నగర బహిష్కరణ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి అడ్మిన్ వెంకటాద్రి, అర్బన్ సిఐ చలపతి, ఎస్ఐ జహీర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి విద్యా సాగర్‌నాయుడు



డిఎస్‌పికి వినతి పత్రం ఇస్తున్న మాజీ సైనికులు

న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మాజీ సైనికుడి కుటుంబానికి జరిగిన అన్యాయంపై విచారించి వారికి న్యాయం చేయాలని కోరుతూ గురువారం రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు, సైనిక సంక్షేమ సభ్యులు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, డిఎస్‌పి కొండయ్య నాయుడు లను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ వాల్మీకిపురం మండలం, మోరువండ్ల పంచాయతీ, పెద్దవంకపల్లి గ్రామానికి చెందిన మాజీ సైనికుడు చంద్రగిరి లక్ష్మన్న కుమా రుడు వెంకటాద్రికి చెందిన భూమి కబ్జాకు గురి కావడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నా డన్నారు. ఈ మేరకు.. రాష్ట్ర కమిటీ, మదనపల్లి అసోసియేషన్ అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులు నాయుడుతో కలిసి బాధిత మాజీ సైనికుని కుటుంబాన్ని పరామర్శిం చినట్లు తెలిపారు. కబ్జాకు గురైన భూమిని ఇప్పించాలని, ఆర్థిక సహాయం అందించాలని, ఇళ్ళ స్థలం కేటాయించాలని కోరినట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేందుకు ఉద్యమం చేస్తున్న మదనపల్లి అసోసియేషన్ మాజీ సైనికులపై నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. దీనిపై సబ్‌కలెక్టర్, డిఎస్‌పి సానుకూలంగా స్పందించటం సంతోష దాయకమని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి.విశ్వేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరెడ్డి శివకుమార్, అనంతపురం, కడప, సత్య సాయి, చిత్తూరు, మదనపల్లి, కర్నూలు జిల్లాల మాజీ సైనికులు పాల్గొన్నారు.



ల్యాబ్ ప్రారంభోత్సవంలో అధికారులు

డైట్ కళాశాలలో ఐసిటి ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని డైట్ కళాశాలలో ఆధునిక సాంకేతికతకు తోడ్పాటుగా ఐసిటి కంప్యూటర్ ల్యాబ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ ల్యాబ్‌ను రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వీరభద్రారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి కె.సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా వీరభద్రారెడ్డి మాట్లాడుతూ "పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్లు, వీడియోలు, అనిమేషన్‌ల ద్వారా పాఠాలను ఆసక్తికరంగా బోధించవచ్చు. గణిత, శాస్త్రం, భౌగోళికం వంటి విషయాలలో విజువల్ డెమాన్‌స్ట్రేషన్లు అందించడం సులభం" అని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇంటరాక్టివ్ లెర్నింగ్ టూల్స్ (అప్‌లు, గేమ్స్, క్విజ్‌లు) ద్వారా విద్యార్థుల ఆసక్తి పెరుగుతుందిన్నారు. డైట్ కళాశాల ప్రిన్సిపల్ అజయ్ కుమార్ మాట్లాడుతూ డిజిటల్ టెస్టులు, ఇ-పుస్తకాలు, సిమ్యులేషన్ల ద్వారా అభ్యాసాన్ని మెరుగుపర్చన్నారు. విద్యార్థుల ప్రగతిని ఆన్‌లైన్ ద్వారా గుర్తించి, వారికి సరైన మార్గనిర్దేశనం చేయవచ్చు అని తెలిపారు.ఐసిటీ లెక్చరర్ అసదుల్లా మాట్లాడుతూ టెక్నాలజీ ద్వారా ఉపాధ్యాయులు నూతన బోధనా విధానాలు, శైలీలను నేర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శివ భాస్కర్, రెడ్డప్ప రెడ్డి, జాఫర్, రెడ్డయ్య, నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతుల్లో రోస్టర్ విధానాన్ని పాటించాలి

ప్రజాశక్తి-రాయచోటి : ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా జరుగుతున్న ఉద్యోగోన్నతుల్లో మెరిట్ కం రోస్టర్ విధానాన్ని పాటించి ఎస్సీ, ఎస్టీ, బీసీ అన్ని వర్గాల మహిళా ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రవిశంకర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పల్లం రామచంద్ర పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ శ్రీధర్‌ను కలిసి వారు వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం రూపొందించిన విధానంలో మెరిట్ ప్రకారం జాబితా రూపొందించడం వల్ల పైన పేర్కొన్న వర్గాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. జీవో నెంబర్ 90 ప్రకారం నూతన జాబితా రూపొందించాలని జరుగుతున్న అన్యాయాన్ని వారు కలెక్టర్‌కు వివరించినట్లు తెలిపారు.

అశ్వవాహనంపై శ్రీరామచంద్రుడి పార్వేట

ప్రజాశక్తి-వాల్మీకిపురం



వాల్మీకిక్షేత్రంలోని శ్రీ పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి 8 గంటలకు స్వామివారు అశ్వావాహనంపై పార్వేటకు బయల్దేరారు. ఉదయం సుప్రభాతసేవ, మూలవర్లకు అభిషేకం, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, తిరుచ్చిలో స్వామివారి అలంకరణ, తిరుచ్చి ఉత్సవం, స్నపన తిరుమంజనం సేవలు వేడుకగా జరిగాయి. సాయంత్రం ఊంజల్ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం వాహన మండపంలో స్వామివారిని విల్లంబులు ధరింపజేసి పార్వేటకు సిద్ధం చేశారు. అశ్వవాహనంపై విల్లంబులతో భక్తులకు శ్రీరామచంద్రుడిగా దర్శనమిచ్చారు. పార్వేట మండపంలో ఆలయ సలహాదారులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు రాములవారి పార్వేట ఉత్సవం గురించి కథారూపంలో భక్తులకు వివరించారు. వేట అనంతరం స్వామివారు తిరుమాడవీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి కృష్ణమూర్తి, సిబ్బంది నాగరాజ, భక్తులు పాల్గొన్నారు.

దారి వివాదంపై తహశీల్దార్ విచారణ

ప్రజాశక్తి-పీలేరు

దారి వివాదంపై అందిన ఫిర్యాదు మేరకు తహశీల్దారు భీమేశ్వరరావు విచారణ చేపట్టారు. పీలేరు మండలం, జాండ్ల పంచాయితీ, నల్లగుట్టపల్లె తండాకు చెందిన పార్వతమ్మ ఇంటి ముందు దారి ఆక్రమణ విషయమై గురువారం తహశీల్దారు గ్రామానికి చేరుకుని వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. అదే స్థలానికి తమకు పట్టా ఉందని రాజా రామ్మోహన్‌రెడ్డి అనే వ్యక్తి వాదించాడు. పట్టా చూపమని అడిగిన అధికారులకు ఆయన పట్టా చూపకపోవడం గమనార్హం. ఇదే స్థలంలో నాలుగు సెంట్లు భూమిని స్థిర నివాసానికి ప్రభుత్వ అధికారులు పట్టా ఇచ్చారని బాధితురాలు పార్వతమ్మ తహశీల్దారుకు వివరించారు. స్పందించిన తహశీల్దారు ఇరువర్గాలను పిలిచి మాట్లాడి ఇది గ్రామ సమస్య కావడంతో ఇరువురూ సమన్వయంతో పరిష్కరించుకోవాలని సూచించారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఇరువురికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎస్టీ కుటుంబాల ఇండ్లకు దారి సౌకర్యం కల్పిస్తామని తహశీల్దారు హామీ ఇచ్చారు. ఈ తనిఖీలో వీఆర్వో హేమంత్ నాయక్, సర్వేయర్ మహేష్, రెవిన్యూ సిబ్బంది, బాధితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


సిఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న కెకె చౌదరి

ఖాదీ, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాష్ట్రంలో ఖాదీ గ్రామీణ పరిశ్రమల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ కెకె చౌదరి పేర్కొన్నారు. గురువారం అమ రావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును రాష్ట్ర ఖాదీ బోర్డ్ సిఇఒ విఆర్. నాయక్‌తో కలిసి ఖాదీ, గ్రామీణ పరిశ్ర మల బోర్డు ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాం తాలలో పరిశ్రమల ఏర్పాటు గురించి చర్చించినట్లు తెలిపారు. రైల్వేకోడూరు నియోజవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలను సిఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. గ్రామీణ పరిశ్రమల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష 21కి వాయిదా

ప్రజాశక్తి-రామాపురం

రాష్ట్ర వ్యాప్తంగా 2025-26 విద్యా సంవత్సరంలో ఆదర్శ పాఠశాలల్లో 20న జరగవలసిన ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష 21వ తేదీకి మార్చినట్లు పాఠశాల విద్యా కమిషన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్యామలాదేవి పేర్కొన్నారు. 20న ఈస్టర్ పండుగ ఉన్నందున 21వ తేదీకి మార్చినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ మార్పును గమనించి 21న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు మోడల్‌స్కూల్‌లో నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లె

స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన నోటు పుస్తకాలను కళాశాల ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణమూర్తి, అధ్యాపకు బృందం పంపిణీ చేసినట్లు ప్రిన్సిపల్ బాలకృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తూ ఇంకా ప్రభుత్వము పాఠ్యపుస్తకాలు బ్యాగులు మొదలుకొని సరఫరా చేస్తుందని అదేవిధంగా ఇక్కడ 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ ప్రవేశాలలో జనరల్ కోర్సులు, వృత్తి విద్యా కోర్సులు కూడా అడ్మిషన్లు జరుగుతున్నటుల తెలిపారు. పట్టణం పరిసర ప్రాంతాలు విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో శివపార్వతిదేవి, శ్రీదేవి, మాలతి, రమణ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సేగు రెడ్డప్పరెడ్డి పాల్గొన్నారు.



దంతాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఖాదర్ బాషా

గర్భిణులకు దంత సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-వీరబల్లి

గర్భవతులకు నోటి దంతాల పరిశుభ్రతపై వాటి వలన వచ్చే వ్యాధుల పట్ల గురువారం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో దంత వైద్య నిపుణులు డాక్టర్ ఖాదర్‌బాషా అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రపంచ నోటి దంతాల దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం డాక్టర్ మనీషా ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భవతులకు దంతాల పరిశుభ్రత వలన నోటి జబ్బులను అరికట్టవచ్చుని తెలిపారు. రోజుకు రెండుసార్లు బ్రష్ తో పండ్లను శుభ్రం చేసుకోవచ్చని చెప్పారు. దీనివలన నోటి జబ్బులను అరికట్టవచ్చునని అన్నారు. పిల్లలకు ఆరు నెలల నుండి మూడు సంవత్సరాలు వరకు పాల దంతాలు వస్తాయని, దంతాల సంరక్షణపై తల్లులకు అవగాహన కల్పించారు.

చేనేత సంఘం అధ్యక్షులుగా మదన్‌మోహన్

ప్రజాశక్తి-వీరబల్లి

వైసిపి తరుపున మండల చేనేత సంఘం అధ్యక్షులుగా మదన్మోహన్ ఎంపికైనట్లు ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎంపిపిని వైసిపి నాయకులు వీరనాగిరెడ్డిని, మండల చేనేత సంఘం అధ్యక్షులు మదన్మోహన్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మదన్మోహన్ మాట్లాడుతూ మాజీ ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి సహకారంతో మండల చేనేత సంఘం అధ్యక్షులుగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాగిమానీదిన్నెపల్లె వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ క్యాన్లు వితరణ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి


వాటర్ క్యాన్లను అందిస్తున్న పూర్వపు విద్యార్థులు

తంబళ్లపల్లె హై స్కూల్లో 1997-98 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు వాటర్ క్యాన్లను అందించారు. పూర్వ విద్యార్థి కీర్తిశేషులు వెంకటేశ్ జ్ఞాపకార్థం అతని స్నేహితులు శ్రీనివాసులు, ఎస్ఎంసి చైర్మన్ సుగవాసి శివకుమార్‌ను కలసి విద్యార్థుల తాగు నీటి కోసం పది వాటర్ క్యాన్లను అందించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సుబ్రహ్మణ్యం, దామోదర్ రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రాయితీపై ఫ్రూట్ కవర్లు సరఫరా

ప్రజాశక్తి-రైల్వేకోడూరు


మామిడి కాయలకు తొడిగిన ఫ్రూట్ కవర్లు

మామిడి రైతులకు రాయితీపై ఫ్రూట్ కవర్లు సరఫరా చేస్తున్నామని ఉద్యాన శాఖ అధికారులు ఆషియా, భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి పంట సాగులో ప్రధాన సమస్యలైనా మంగు,మసి తెగులు,పండు ఈగ,తామర పురుగులు, బూడిద తెగులు,మచ్చ తెగులు,కాయ తులుచు పురుగు,పిండి నల్లి, టెంక పురుగులు దాడిని నియంత్రించి నాణ్యమైన పండ్లు దిగుబడికి తోడ్పడుతుందని అన్నారు. పింద దశలో అనగా నిమ్మకాయ, కోడిగుడ్డు పరిమాణంలో పిందెలు ఉన్నప్పుడు పండ్ల కవర్ మధ్యలోకి పిందెలు వచ్చేలా పిందెలకు కవర్లు తొడిగి, కవర్లకు ఉండే తీగ సహాయంతో కవర్లను గాలి లోపలికి చొరబడకుండా పిందెనుండి మూడు సెంటీమీటర్లు పైన తొడిమికి కట్టాలని తెలిపారు. పండ్ల కవర్లు కట్టిన 50 నుండి 60 రోజుల తర్వాత కాయలను కోతలు ప్రారంభించవచ్చునని తెలిపారు. మామిడి పండ్లను చీడపీడల బారిన పడకుండా కాయ నాణ్యతను పెంచుతుందని తెలిపారు. మామిడి పండ్లకు అధిక ఉష్ణోగ్రతలు, వర్షము, వడగండ్లు, గాలుల వల్ల నష్టం వాటిల్లకుండా కాపాడుతుందన్నారు. రసాయనిక మందుల వినియోగాన్ని తగ్గిస్తుందని, కాయ రూపాన్ని అనగా రంగు, షైనింగ్, పరిమాణాన్ని మెరుగుపరుస్తుందని తెలిపారు. మామిడిపండ్ల నాణ్యత ప్రమాణాలు పెరగడం వల్ల అంతర్జాతీయ ఎగుమతులకు అవకాశం లభిస్తుందని ,రైతు లకు లాభసాటి ధర లభిస్తుందని అన్నారు. అంతేకాకుండా 40 నుండి 50 రోజుల్లో రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని తెలిపారు. మామిడి పండ్లు పాడవకుండా ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఒక రైతుకు గరిష్టంగా పదివేల కవర్లను 50శాతం రాయితీపై అందిస్తామని, కావలసిన రైతులు ఒక కవర్‌కి ఒక రూపాయి 20 పైసలు, నాన్ సబ్సిడీని రైతు వాటాగా చెల్లించి ఉద్యాన చిట్వేలి, రైల్వేకోడూరు ఉద్యానశాఖ కార్యాలయంలో పొందవచ్చన్నారు. కార్యక్రమంలో చిట్వేలి, రైల్వేకోడూరు ఉద్యాన అధికారులు ఆషియా, భాస్కర్ తెలిపారు.

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం :'ముక్కా'


సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, కుడా చైర్మన్ రూపానందరెడ్డి

ప్రజాశక్తి-పుల్లంపేట

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం ఓబులవారిపల్లి మండల పరిధిలోని పున్నటివారిపల్లి ఎగవపల్లి, నూకనపల్లి, లింగిరెడ్డిపల్లి గ్రామాల్లో సిమెంటు రోడ్లకు వారు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో అభివృద్ధికి బాటలు పడుతున్నాయని ప్రజలంతా సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గం లోని ప్రతి మారుమూల గ్రామానికి కూడా సిమెంటు రోడ్డును ఏర్పాటు చేశామని అన్నారు. అభివృద్ధి అంటే మాటల్లో చెప్పడం కాదని చేసి చూపించడమే అభివృద్ధికి నిదర్శనమని అన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న దృష్ట్యా ప్రతి గ్రామంలోనూ నీరు పుష్కలంగా ఉండాలని నీటి కొరత ఉన్న గ్రామాల ప్రజలు తమను సంప్రదిస్తే వెంటనే పరిష్కరించడానికి ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. మెరుగైన రహదారులు, తాగునీరు, విద్యుత్, వైద్య సౌకర్యాలు వంటి సేవలు గ్రామ ప్రజలకు చేరేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో ప్రజల జీవన స్థాయిలో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. అనంతరం నూకనపల్లి లోని ఎంపియుపి స్కూల్, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పాఠశాలకు కావలసిన వసతుల గురించి తెలుసుకోవడం జరిగిందని చిన్నపిల్లలకు భోజనం స్వయంగా వడ్డించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నవజాత శిశువుకు ముర్రుపాలు శ్రేష్టం

ప్రజాశక్తి-రామాపురం



రామాపురం: తల్లి పాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ సూపర్‌వైజర్

అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు శ్రేష్టమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ హుస్సేనమ్మ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణిగా ఉన్నప్పుడు రక్తహీనత రాకుండా పౌష్టికాహారం తీసు కోవాలని సూచించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రిపాలు తాగించడం వల్ల వ్యాధి నిరోధిక శక్తి బిడ్డకు సంపుష్టిగా లభిస్తుందని అన్నారు. తల్లికి రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్ లాంటి వ్యాధులు కాకుండా ఉంటాయని అన్నారు. ఈ సమావేశంలో అంగన్వాడీ కార్యకర్త ప్రసన్న, ఆయా, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. **సుండుపల్లి :** మండల కేంద్రం సుండుపల్లిలోని కృష్ణానగర్ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, తల్లిపాలపై అవగాహన కార్యక్రమాన్ని మండల వైద్యాధికారి ఫర్హాన్‌బేగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు తల్లి పాలు తాపించాలని సూచించారు. అలా తాపించడం వల్ల ఎలాంటి జబ్బులు రాకుండా ఉంటాయని తెలిపారు. అనంతరం సుండుపల్లె సెక్టర్-2 సూపర్‌వైజర్ వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు అందించే పోషకమైన ఆహారాన్ని పాలు గుడ్లు బాల సంజీవిని పిల్లలకు పెట్టాలని గర్భస్థులు బాలింతలకు కూడా అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సంధ్య, మస్తానీ, బండి శ్రీదేవి, రామలక్ష్మి , రామ తులసి, ఓబులమ్మ, ప్రేమలత, మల్లేశ్వరి, శంకరమ్మ, విశాలిని అనిత పాల్గొన్నారు.


సోలార్ భూములను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు

అర్హులందరికీ న్యాయం చేస్తాం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-గాలివీడు

సోలార్ కింద భూమిని కోల్పోయే ప్రతి రైతుకూ న్యాయం చేసామని ఆర్‌డిఒ ఎస్. శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం తూము కుంట గ్రామంలోని దిగువమూల, ప్రకాష్‌నగర్ కాలనీ ప్రజలకు సంబం ధించిన భూములు ఆయన పరిశీలించారు. ఇప్పటికీ 115 ఎకరాలు గుర్తించి నట్లు తెలిపారు. 50 ఎకరాలు ప్రభుత్వ భూమి పోను మిగతా భూమికి లబ్ది దారులతో సమావేశం ఏర్పాటు చేసుకొని పరిహారం అంది చడానికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని పేర్కొన్నారు. తహశీల్దార్ జె. భాగ్యలత, ఆర్ఐ బాలాజీ, సర్వేయర్, విఆర్ఒ యేసురత్నం, గ్రామస్తులు పాల్గొన్నారు.

విషతుల్య శీతలపానీయాలు నిషేధించాలి

ప్రజాశక్తి-గాలివీడు

రసాయనాలతో తయారు చేసిన శీతల పానీయాలను నిషేధించాలని జెవివి మండల అధ్యక్షుడు కానాల శివారెడ్డి పేర్కొన్నారు. వేసవిలో పిల్లలు మొదలుకొని పెద్దల వరకు ప్రతి ఒక్కరూ శీతల పానీయా లపై దృష్టి పెట్టి విరివిగా సేవిస్తూ ఉంటారని అన్నారు. వాటి ద్వారా పొందే అనర్థాలపై దృష్టి పెట్టి కంపెనీల ద్వారా వచ్చే శీతలపానీయాలను బహిష్కరించాలని పేర్కొన్నారు. వేసవిలో నిమ్మరసం, చెరుకు రసం చల్లగా నున్న కర్భూజా, దోస, సపోటా, తాటిమందేలు, మజ్జిగ, మట్టి కుండలో నీటితో పాటు మజ్జిగను కూడా సేవిస్తే ఆరోగ్యంగా ఉండగలుగుతారని పేర్కొన్నారు.

రేపు ఏటిగడ్డ తిరుణాల

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక పంచాయతీ సచివాలయ-3 పరిధిలో ఉన్న కుషావతీ నది ఒడ్డున వెలసిన ఆసర్ల గంగమ్మ జాతర బలిజపల్లి వద్ద ఉన్న ఏడిగడ్డ తిరుణాల శని, ఆదివ వారాల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు కేడెం లక్ష్మయ్య పేర్కొన్నారు. ఇప్పటికే సోలెం గ్రామంలోని ప్రతి పల్లెకు తిరుగుతున్నదని అన్నారు. శనివారం రాత్రి చాందిని బండ్లతో పెద్ద గొడుగుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం బోనాలు సమర్పించడం జరుగుతుందని పేర్కొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-మదనపల్లె

స్థానిక శ్రీ జ్ఞానంబికా డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 57 యూనిట్ల రక్తాన్ని విద్యార్థులవద్ద నుంచి సేకరించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్ కుమార్, స్టాఫ్ నర్స్ లు సునీత, వనజ, టెక్నీషియన్లు చిన్నకేశవులు, ధనుంజయ, రెడ్డిశేఖర్ పాల్గొని రక్తాన్ని ప్రభుత్వ ఆసుపత్రి రక్తనిధి కేంద్రానికి అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ హేమశేఖర్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-వీరబల్లి

మండల ఆరోగ్య ప్రాథమిక కేంద్రంలో గురువారం గర్భవతులకు అన్నదానం ప్రదానం చేశారు. ప్రతి నెల ఆరోగ్య కేంద్రంలో జరిగే గర్భిణులు, బాలింతల వైద్య పరీక్షల అనంతరం స్థానిక మండల ఎంపిపి గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ప్రతినెలా వైద్య పరీక్షలకు హాజరయ్యే గర్భిణులు, బాలింతలు,చ వైద్య సిబ్బందికి తన సొంత ఖర్చులతో పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు.

మదనపల్లె డిఎస్‌పి బదిలీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


డిఎస్‌పి కొండయ్యనాయుడు

మదనపల్లె డిఎస్‌పి కొండయ్యనాయుడును బదిలీ చేస్తూ రాష్ట్ర డీజిపి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం మదనపల్లె డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన ఆయన పది నెలల కాల వ్యవధిలోనె బదిలీ అయ్యారు. భీమవరం డిఎస్‌పి మహేంద్రను మదనపల్లె డిఎస్‌పిగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కొండయ్య నాయుడును సిఐడికి బదిలీ చేశారు.

అంబేద్కర్ అందరికీ ఆదర్శం

ప్రజాశక్తి-మదనపల్లె

ఈనెల 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరిం చుకుని స్థానిక బి.టి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కళాశాలలోని బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు కళాశాలలోని ప్రార్థనా మందిరం వద్ద సమావేశమై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారని ప్రిన్సిపల్ ఆనంద్‌రెడ్డి తెలిపారు. భారత రాజ్యాంగ ప్రవేశకను చదివి విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మనందరికీ ఆదర్శమని, ప్రతి విద్యార్థి ఆయన లాగా గొప్ప చదువులు చదివి దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రపంచంలోని అన్ని రాజ్యాంగాలను అధ్యయనం చేసి వాటన్నింటి మేలుకలయికగా మన రాజ్యాంగాన్ని రూపొందించారని, అలాంటి గొప్పదైన మన రాజ్యాంగ స్పూర్తితో భారతీయులంతా ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శైలజా నిర్వహించారు. విద్యార్థులకు వకృత్వా పోటీలు, వ్యాసరచన పోటీలు, క్విజ్ కార్యక్రమం నిర్వహించారు. తదనంతరం కళాశాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు అధ్యాపకేతర సిబ్బంది అందరూ ర్యాలీగా వెళ్లి బెంగళూరు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిసిటిఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మలిగి రాఘవరెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీదేవి కళాశాల అధ్యాపకులు డాక్టర్ డి.శ్రీనివాసులు డాక్టర్ డి.చిన్నారెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు


పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఇఒ రవీంద్రనాయక్

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఇఒ రవీంద్రనాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని సుండుపల్లె గ్రామపంచాయతీలో పెద్దమాదిగపల్లె ప్రాథమిక పాఠశాలలో అమ్మనేను ప్రభుత్వ పాఠశాలకు వెళతాననే కార్యక్ర మాన్ని నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించే వస తులు, విద్యా ప్రమాణాలపై వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదురుకుంటుందని అన్నారు. నాణ్యమైన విద్యతో పాటు యూని ఫారం, పుస్తకాలు, మధ్యాహ్నం భోజనం, పౌష్టికాహారం అందిస్తుందని తెలిపారు. పిల్లల ను తప్పకుండా ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని తల్లిదండ్రులకు సలహాలు, సూచనలు అందించారు. తల్లిదండ్రులు ఎలాంటి ఫీజులు చెల్లించవలసిన అవసరం లేదని, ప్రభుత్వమే అన్ని ఉచితంగా అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు, అంగన్వాడీ కార్యకర్త ఓబులమ్మ పాల్గొన్నారు.

క్రైం కార్నర్


నాటుసారా, అక్రమ మద్యాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

రూ.13.78 లక్షల విలువైన మద్యం ధ్వంసం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన 212 కేసుల్లో నాటుసారా, కర్నాటక మద్యాన్ని గురువారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ వైఎస్ఆర్ జిల్లా డిప్యూటీ కమీషనర్ ఆదేశాలతో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మధు సూధన్ సమక్షంలో మదనపల్లె ఎక్సైజ్ సిఐ భీమలింగ సిబ్బంది తో ధ్వంసం చేశారు. రూ.13,78,700లు విలువచేసే కర్ణాటక మద్యం, నాటు సారాను తీసుకెళ్లి పట్టణా నికి సమీపంలో ఉన్న మైదానంలో ధ్వంసం చేశారు. ధ్వంసం చేసిన వాటిలో 56నాటు సారా కేసుల్లో రూ.5,66,700 విలువ కలిగిన 1889.3 లీటర్ల నాటుసారా, 132 కేసుల్లో పట్టుబడ్డ కర్ణాటక అక్రమ మద్యం రూ.6,32, 500 (863.61 లీటర్లు), 18కేసుల్లో 56 లీటర్ల బీర్లు, సుమారుగా రూ.72, 190 విలువ కలిగినవి ఉన్నాయని తెలిపారు. 6 కేసుల్లో 84.93 లీటర్ల డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను, 650 ఎంఎల్ బీర్లను ట్రాక్టర్‌తో తొక్కించారు. రూ.1.7లక్షలు విలువ కలిగిన 2139.55 కిలోల బెల్లంను నీటికుంటలో పారబోసినట్లు తెలిపారు.

బాలిక అదృశ్యం : కేసు నమోదు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మైనర్ బాలిక అదృశ్యం కావడంపై గురువారం కేసు నమోదు చేసినట్లు తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక స్థానికంగా ఉన్న దుకాణానికి వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లింది. ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు గాలింపు చేపట్టారు. రెండు రోజులు పాటు తల్లిదండ్రులు కుమార్తె కోసం బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఇక చేసేది లేక తమ కుమార్తె ఆచూకి తెలపాలని తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు.. బాలిక అదృశ్యం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేధింపులపై..

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఒకటో పట్టణ సిఐ ఎరిసావల్లి తెలిపారు. సిఐ కథనం మేరకు.. ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసమున్న బి. లక్ష్మీప్రసన్నకు స్థానికంగా ఉండే బొమ్మిశెట్టి రెడ్డిగిరీష్‌తో 2022లో పెద్దలు కుదర్చిన పెళ్లి చేసినట్లు తెలిపారు. పెళ్లి సమయంలో రూ.4లక్షలు విలువ చేసే బంగారు ఆభర ణాలు, నగదును కట్న కానుకలుగా ఇచ్చి ఘనంగా పెళ్లి జరిపించారు. కొద్ది రోజులుపాటు సజావుగా సాగిన వీరి కాపురంలో అదనపు కట్నం కోసం రెడ్డిగిరీష్ భార్యను వేధింపులకు గురి చేస్తూ పుట్టింటికి పంపాడు. బాధితురాలు లక్ష్మి ప్రసన్న ఫిర్యాదు చేయడం పై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


హరిని ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

వేర్వేరు కారణాలతో గురువారం ఇద్దరు ఆత్మహత్యా యత్నానికి పాల్ప డ్డారు. బాధితుల కథనం మేరకు.. మదనపల్లె మండలం, పొన్నెటిపాలెం పంచాయి తీకి చెందిన 14 ఏళ్ల బాలిక ఇంట్లో పనులు సక్రమంగా చేయడం లేదని తల్లిదండ్రులు మందలించారు. తీవ్ర మనస్తాపానికి గురైన బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు బాధితురాలని వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

చౌడేపల్లి మండలం, అప్పినపల్లికి చెందిన హరి భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇంటి నిర్మాణం, కుటుంబ అవసరాల నిమిత్తం సుమారు రూ.9లక్షల వరకూ అప్పులు చేశాడు. పనులు మందగించడం, ఆదాయ వనరులు లేకపోవడం, కుటుంబ సమస్యలు చుట్టు ముట్టడంతో చేసిన అప్పులు తీర్చలేకపోయాడు. రుణ దాతల వత్తిళ్లు ఎక్కువయ్యాయి. అప్పు తీర్చే మార్గం లేకపోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని మదనపల్లె ప్రభు త్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు.

టెంపో బోల్తా : ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

టెంపో బోల్తాపడి ఇద్దరు తమిళనాడు వాసులు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం కురబలకోట మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం, కాంచీపురం సమీపంలోని వెన్ బాకంకు చెందిన దాస్, సురేష్ కంచర్ల సమీపంలో పశువులను కొనుగోలు చేసి టెంపోలో తమిళనాడుకు తరలిస్తున్నారు. మార్గమధ్యంలోని కురబలకోట రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద టెంపో టైరు పేలడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో టెంపోలోని కొన్ని పశువులకు కొమ్ములు విరిగడంతో రక్తస్రావం అయ్యింది. పశువులను తరలిస్తున్న దాస్, సురేషు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న కురబలకోట 108 సిబ్బంది మనోహర్, రఫీ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.